సాక్షి చిత్తూరు

బుధవారం। 6। మార్చి। 2024



'దుంప'లాభం..!

కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో రైతులు అధికంగా దుంప పంటలను సాగు చేస్తున్నారు.

- 8లో



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

వి.కోట, గుడిపాల మండలాలకు చెందిన టీడీపీ నేతలు పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

- 8లో



జనారణ్యంలో జడుసుకుని..

ఐరాల మండలం బెస్తపల్లెలోని పాడుపడిన వ్యవసాయ బావిలో అడవి పందుల గుంపు పడిపోయింది.

- 8లో

న్యూస్‌రీల్

శ్రీశైలం మల్లన్నకు పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న మోహన్‌రెడ్డి, వెంకటేశు తదితరులు

కాణిపాకం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారికి కాణిపాకం వినాయకస్వామి ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం ఈ మేరకు కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు శ్రీశైలం ఆలయ బోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజుకు పట్టువస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ ఏఈఓలు హరిదాసు, స్వాములు, మోహన్, కాణిపాకం ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

విద్యార్థినులతో 'గూగుల్ మీట్'



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

పలమనేరు : మండలంలోని 9వ తరగతి విద్యార్థినులతో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సమావేశమయ్యారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్ అంశంపై మాట్లాడారు. ఈ విభాగంలో ప్రధానమంత్రి ఎక్సలెన్స్ అవార్డుకు రాష్ట్రం షార్ట్‌లిస్ట్ కావడంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఈవో దేవరాజు మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే పిల్లలు ఒత్తిడికి లోను కాకుండా మానసికంగా సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం పాల్గొన్నారు.

చౌడేపల్లె లైబ్రరీకి పుస్తకాలు



పుస్తకాలు అందిస్తున్న సిద్ధులు

చౌడేపల్లె : జపాన్ నుంచి తీసుకువచ్చిన పుస్తకాలను మాజీ సైనికోద్యోగి చంద్రగిరి సిద్ధులు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల లైబ్రరీకి అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగరాజారెడ్డి తెలిపారు. విద్యార్థులు తమ మేథో సంపత్తిని పెంపొందించుకునేందుకు ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇంతటి విలువైన పుస్తకాలు పంపిన పూర్వ విద్యార్థి సిద్ధులును అభినందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మునిరత్నం, ఉపాధ్యాయులు మురళీ, మధుసూదన రెడ్డి, రామకృష్ణ, ఈశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.

సృష్టికి మూలం స్త్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎంపీ రెడ్డెప్ప

కుప్పం : సృష్టికి మూలం స్త్రీ అని, మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంబికా కల్యాణ మండపలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించేందుకే ప్రభుత్వం దిశ చట్టం తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఆడవారిపై అఘాయిత్యాలను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, అందుకే ప్రతి సంక్షేమ పథకాన్ని వారికే అందిస్తున్నారని తెలిపారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్ పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



దెబ్బతిన్న టమాట తోట

రామకుప్పం : మండలంలోని ముద్దనపల్లె, బిరుగుండ్లపల్లెలో పంటలను సోమవారం రాత్రి రెండు ఏనుగులు ధ్వంసం చేశాయి. ప్రధానంగా వరి, టమాట, మిరప పంటలను నాశనం చేశాయి. పొలాల్లోని వ్యవసాయ పరికరాలను సైతం తొక్కేశాయి. బాధిత రైతులు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించాలని కోరారు.

రోల్ మోడల్



రామకుప్పం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్



తరగతి గదిలో విద్యార్థులు

పేదింటి బిడ్డలు ఉన్నతంగా చదువుకోవాలి.. ఉత్తమ బోధనతో వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి.. పిల్లలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి.. ఇదే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలలను నెలకొల్పారు. అయితే మహోన్నత లక్ష్యాన్ని తదనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం నీరుగార్చేసింది. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడే దుస్థితిని తీసుకువచ్చింది. ఈ క్రమంలో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ సర్కారు మోడల్ స్కూళ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ హంగులు సమకూర్చింది. ఇంగ్లిష్ మీడియంలో అత్యుత్తమ విద్యాబోధనను పునరుద్ధరించింది. నిరుపేద పిల్లలు సైతం ఆత్మగౌరవంతో చదువుకునే ఆహ్లాదకర వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.



- ఏపీ మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లు
- 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్షకు సన్నాహాలు
- నాడు–నేడు కింద ఆదర్శ పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలనే సదుద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేశారు.. అవి నేడు కార్పొరేట్ విద్యకు పట్టుగొమ్మలుగా అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పథకంతో ఆ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు విద్యాబోధన అందుతోంది.

దరఖాస్తు ఇలా..

సీబీఎస్ఈకి అనుబంధంగా ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 31వతేదీని దరఖాస్తుకు చివరి గడువుగా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా అందజేసిన దరఖాస్తుకు సంబంధించి జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు, ఫొటోను సదరు పాఠశాలలో అందజేయాలి. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అడ్మిషన్‌కు అర్హులు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చలానా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూళ్లలోనే ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఫలితాలను ఏప్రిల్ 27వ తేదీన వెల్లడించనున్నారు. 30న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ , కౌన్సెలింగ్ ఉంటుంది. జూన్ 12వ తేదీ నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి.

విద్యాబోధన ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీ మోడల్ స్కూళ్లలో ఆంగ్లంలో విద్యాబోధన ఉంటుంది. దీంతో ఏటా ఆ పాఠశాలల్లో విద్యార్థులు పెరుగుతూ వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఒక్కసారి 6వ తరగతిలో చేరితే... ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి అయ్యేవరకూ అక్కడే విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రతి తరగతిలోనూ 80 మందికి అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఒక్కో గ్రూపులో 20 మంది చొప్పున విద్యార్థులు ఉంటారు. నాణ్యమైన యూనిఫామ్, టై, బెల్టు, షూ, పుస్తకాలు, ట్యాబ్‌లు, మధ్యాహ్న భోజనం, లైబ్రరీ, విశాలమైన ఆటస్థలం ఇతర వసతులు ఉంటాయి. సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్, లిప్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తుండడంతో ఇక్కడి విద్యార్థులు పోటీ ప్రపంచంలో ధీటుగా రాణిస్తున్నారు.

ప్రతి పాఠశాలలో 100 అడ్మిషన్లు

జిల్లా వ్యాప్తంగా 7 ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి . రొంపిచెర్ల, బైరెడ్డిపల్లె, గుడుపల్లె, శాంతిపురం, కుప్పం, రామకుప్పం, పుంగనూరు మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ సాగుతోంది. ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి గతంలో 80 సీట్లు మాత్రమే కేటాయించే వారు. విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపం మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వంద సీట్లకు పెంచింది. ఈ లెక్కన 25 పాఠశాలల్లో 2,,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు దక్కనున్నాయి. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఆదర్శ పాఠశాల లేని మండలాల్లోని విద్యార్థులు సమీప మండలాల మోడల్ స్కూళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత మండల విద్యార్థులు లేని పక్షంలో మాత్రమే పక్క మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం ఉంది.



బైరెడ్డిపల్లె మండలంలోని ఆదర్శ పాఠశాల



ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు గార్డెనింగ్ చేస్తున్న సిబ్బంది

> **ఇంటర్ వరకు ఉచితం**
>
> 
>
> పేద విద్యార్థులకు ఏపీ మోడల్ స్కూల్ వరం లాంటింది. కార్పొరేట్ విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం ఈ ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. నూతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, మెరుగైన సౌకర్యాలు ఉండడంతో మోడల్ స్కూళ్లకు ఆదరణ పెరిగింది. ఇక్కడ ఒక్కసారి సీటు దక్కితే ఇంటర్ పూర్తయ్యే వరకూ చక్కగా చదువుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.
>
> – దేవరాజు, డీఈఓ, చిత్తూరు

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు
- మళ్లీ గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రూ.5.95 కోట్ల పనులకు భూమి పూజ



టౌన్‌షిప్ పనులు ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజలు మేలు చేకూరిందని, మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం చిత్తూరులో చుడా ఆధ్వర్యంలో చేపట్టిన రూ.5.95 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. సంతపేట వద్ద రూ.30 లక్షలతో చిన్న పిల్లల పార్కు, కోడిగుంట ఎంఐజీ లేవుట్‌లో రూ. 5.65కోట్లతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఫేజ్–1 పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి చిత్తూరు వాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం టౌన్ షిప్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్‌లో మరిన్ని టౌన్ షిప్‌లు వస్తాయని తెలిపారు. పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఫేజ్–1లో భాగంగా చిత్తూరు నగరంలో ఇంటి స్థలాలు అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కోడిగుంట ప్రాంతంలో 35 ఎకరాలు సేకరించి, అందులో ఉపయుక్తంగా ఉన్న 9 ఎకరాల్లో 85 ప్లాట్‌లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి, చుడా వైస్ చైర్మన్ విశ్వనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, హరిణిరెడ్డి, నాయకులు తవణంపల్లి ప్రకాష్ రెడ్డి, భూపేష్ గోపీనాథ్, అప్పోజీ, వెంకటేష్, శేఖర్, లోకేష్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

పర్యాటక క్షేత్రంగా బోయకొండ

చౌడేపల్లె : బోయకొండను ఆధ్యాత్మిక , పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం బోయకొండ గంగాపురంలో రూ.1.90 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కేవీ సోలార్ గ్రిడ్ కనెక్టడ్ రూఫ్ టాప్ పవర్ ప్లాంట్, చుడా ఆధ్వర్యంలో రూ.25 లక్షల వెచ్చించి తీర్చిదిద్దిన పార్కును ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో బోయకొండను రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు 11 హెక్టార్లలో అటవీశాఖ ఆధ్వర్యంలో బోయకొండ వనం ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎకో టూరిజంశాఖ ద్వారా రిసార్ట్ లతో పాటు బోటింగ్, రోప్‌వేను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. సోలార్ గ్రిడ్ ద్వారా ప్రతినెలా ఆలయానికి రూ.20 లక్షల మేరకు కరెంటు బిల్లు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ ఆలీంబాషా, ఎంపీపీలు అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రామమూర్తి, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, సర్పంచ్ సోని, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఓ చంద్రమౌళి, పాలక మండలి సభ్యులు రాజేష్, రజని, రామదాస్, బుడ్డమ్మ, భారతి, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, హైమావతి, రెడ్డెప్ప పాల్గొన్నారు.



సోలార్ గ్రిడ్ ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

వైఎస్సార్‌సీపీకి టీడీపీ నేత



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రవి

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ నగిరి దళితవాడకు చెందిన టీడీపీ నేత రవి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో తమ కుటుంబానికి ఎనలేని మేలు చేకూరిందన్నారు. తన కుమార్తెకు వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగం కూడా వచ్చిందని వెల్లడించారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కోటా వెంకటరమణ, సైపూల్లాఖాన్, బండపల్లె సుభాష్, ఓబులేసు పాల్గొన్నారు.

పరీక్షలకు నిరంతరాయ విద్యుత్



సమీక్షిస్తున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ సుబ్బరాజు

చిత్తూరు కార్పొరేషన్: పరీక్షలకు సంబంధించి ఆయా కేంద్రాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ట్రాన్స్‌కో డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన నగరంలోని సబ్‌స్టేషన్, ఎస్‌పీఎం, స్టోర్స్‌ను పరిశీలించారు. అనంతరం అర్బన్ ఈఈ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. డైరెక్టర్ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ సమస్యలుంటే 1912 టోల్ ఫ్రీ నంబరుకు వినియోగదారులు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. చిత్తూరులో త్వరలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్టోర్స్‌కు నూతన భవనం మంజూరు అయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. సకాలంలో విద్యుత్ పరికరాలు ఆర్డర్ పెట్టుకొని తెప్పించుకోవాలని సూచించారు. గ్రామాలకు త్రీఫేజ్ కరెంటును ఇచ్చేందుకు ఆర్‌డీఎస్ఎస్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. బిల్లులు చెల్లించని ప్రైవేటు సర్వీసులకు విద్యుత్ సరఫరా ఆపివేయాలన్నారు. చిత్తూరు అర్బన్, రూరల్ పరిధిలో వ్యవసాయ సర్వీసుల పరంగా కస్టమర్ చార్జీల బకాయిలు రూ.1.50 కోట్లు ఉందని వివరించారు. సమావేశంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్, కొండయ్య, సుబ్రమణ్యం, ఏఏఓ గీత పాల్గొన్నారు.

అర్హులందరికీ 'సంక్షేమం'



చెక్‌లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

విజయపురం : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. మంగళవారం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల స్థాపనకు ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన 25 మంది రైతులకు రూ.3 కోట్ల పరిహారం పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ మంచి మనసున్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే సంక్షేమం రెట్టింపు అవుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాటలు చెప్పదని, చేతల్లో చూపిస్తుందని వెల్లడించారు. . గతంలో జగనన్నపై తప్పుడు కేసులు నమోదు చేసి జైల్లో పెట్టినా చిరునవ్వుని చెదరనివ్వలేదని, ఎక్కడా వెనుకడుగు వేయలేదని, భగవంతుని ఆశీస్సులతో 151 ఎమ్మెల్యే సీట్లతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని గుర్తు చేశారు. దేశంలో ఉత్తమ ముఖ్యమంత్రిగా జగనన్న ఉన్నారంటే దానికి కారణం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి, పారదర్శకమైన పరిపాలనే అని వివరించారు. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత ఏ ఎన్నికలు వచ్చినా వార్ వన్ సైడ్‌గానే సాగిందన్నారు. 2019 ఎన్నికల్లో అందరూ సమష్టిగా పనిచేశారని, మళ్లీ అదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా విద్యార్థిని మృతి


పూజిత మృతదేహం

చిత్తూరు అర్బన్: నగరంలోని విజయం విద్యా సంస్థల్లో చదువుతున్న పూజిత (17) అనే విద్యార్థిని అనుమాస్పదంగా మృతి చెందింది. వన్‌టౌన్ ఎస్ఐ షేక్ షావలి కథనం మేరకు.. మదనపల్లెలోని రెడ్డివారిపల్లెకు చెందిన శివశంకర్ పానీపూరి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె పూజిత, కుమారుడు నందకుమార్ ఇద్దరూ చిత్తూరులోని విజయం కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ నగరంలోని మిట్టూరు హాసన్‌ఖాన్ వీధిలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. సోమవారం రాత్రి మృతురాలి సోదరుడు మదనపల్లెకు వెళ్లాడు. మంగళవారం ఉదయం చిత్తూరుకు చేరుకుని తమ గది వద్దకు వచ్చి తలుపు తెరవడానికి ప్రయత్నించగా ఎలాంటి స్పందనలేదు. కిటీలోంచి చూడగా పూజిత తన చున్నీకు ఉరేసుకుని ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ షేక్‌షావలీ తన సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

శ్రీరంగరాజపురం : మండలంలోని సీకేపురంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు..చిత్తూరు టౌన్ 3వ గేట్‌కు చెందిన కృష్ణమూర్తి కుమార్తె ధన్య (20) స్థానిక ఆర్‌వీఎస్ కళాశాలలో డీ ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడు త్రిషూన్‌తో కలసి పుత్తూరులో పరీక్ష రాయడానికి కారు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో విద్యార్థిని మరణించింది. తీవ్రంగా గాయపడిన త్రిషూన్‌ను 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కుళాయప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘దుంప’లాభం..!

దుంపల సాగుకు కొల్లాగుంట చిరునామాగా మారింది. ఇక్కడి నేల స్వభావం అనుకూలిస్తుండడంతో సరిపడా నీటి వనరులతోనే మంచి దిగుబడి వస్తోంది. చీడపీడల బెడద లేకపోవడంతో పెట్టుబడి సైతం తక్కువగానే ఉంటోంది. మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో ఉండడంతో అధిక ఆదాయం సమకూరుతోంది.

- కొల్లాగుంటలో విస్తారంగా దుంపల సాగు
- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- చీడ పీడల బెడద లేని పంట


గెనిస గడ్డల ఒబ్బిడి పనుల్లో మహిళలు

కార్వేటినగరం : గెనిస గడ్డ, చేమగడ్డ, కావలి గడ్డ, కందగడ్డ ఇలా పలు రకాల దుంపలు ఆ గ్రామంలో దొరుకుతాయి. అక్కడి రైతులు కేవలం దుంపలను మాత్రమే సాగుచేస్తారు. నేల స్వభావం సహకరించడం,మార్కెటింగ్ సదుపాయం ఉండడంతో కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట గ్రామం దుంపల సాగుకు పుట్టినిల్లుగా మారింది. సుమారు 40 కుటుంబాలకు చెందిన రైతులు కేవలం దుంపల సాగునే చేపడుతుంటారు. కుశస్థలి నది సమీపంలో గ్రామం ఉండడంతో నీటి సమస్య లేదు. దుంప పంటకు రోజు మార్చి రోజు నీరు అందించాలి. వరితో పోలిస్తే ఈ పంటకు తక్కువ నీరు సరిపోతుంది. ఎలాంటి చీడపీడల భయం లేదు. వరి, వేరుశనగ, సజ్జ, పొద్దుతిరుగుడు పంటల కంటే దుంపల సాగుకు పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుంది.అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ ఈ పంటను సాగు చేసుకోవచ్చు. మార్కెట్‌లో ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. గెనిస గడ్డలు మినహా ఇతర రకాల దుంపలు ఆరు నెలలకు పైగా నిల్వ ఉంటాయి. వీటిని బస్తాలు లెక్కన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. బస్తాకు 90 కేజీలు ఉంటాయి. ఎకరాకు 800 నుంచి వెయ్యి కేజీల వరకు దిగుబడి వస్తుంది. గెనిస గడ్డలు, చేమ గడ్డలు ప్రస్తుతం బస్తా ధర రూ.900 నుంచి రూ.1,200 వరకు పలుకుతున్నాయి. గెనిస గడ్డ సాగుకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం వస్తోంది.

అనుకూల వాతావరణం



ఈ ఏడాది పంట వేసే సమయానికి వాతావరణం బాగా అనుకూలించింది. నేల సైతం సహకరించడంతో 80 శాతం నుంచి వంద శాతం వరకు పంట దిగుబడి వచ్చింది. అలాగే శివ రాత్రికి ముందే పంట చేతికి రావడంతో సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత ఏడాది కంటే మంచి ఆదాయం వచ్చింది.

– చెంగారెడ్డి, రైతు, కొల్లాగుంట, కార్వేటినగరం

జనారణ్యంలో జడుసుకుని..!

- బావిలో పడిన అడవి పందుల గుంపు
- పెద్దసంఖ్యలో గుమికూడిన గ్రామస్తులు
- బతుకుజీవుడా అని తప్పించుకుని పరుగో..పరుగు
- ఆపై ఇళ్లలోకి దూరి కలకలం


పాడుబడిన వ్యవసాయ బావిలో అడవి పందులు

ఐరాల : మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని బెస్తపల్లె సమీపంలో వరి పంటలు సాగులో ఉన్నాయి. ఇక్కడ రైతు చంద్రశేఖర్‌కు పాడుపడిన వ్యవసాయ బావిలోంచి ఏవో శబ్దాలు వస్తూంటే మంగళవారం ఉదయం 7 గంటలకు ఆ వైపు కొందరు వెళ్లి చూసేసరికి ఆశ్చర్యపోవడం వారి వంతైంది. 50 అడుగుల పైచిలుకు లోతు ఉన్న బావిలో భారీ సైజు అడవి పంది ఒకటి తొమ్మిది పిల్లలతో పడి ఉన్నట్టు గుర్తించారు. కొన్ని పిల్ల పందులు తలలు పైకెత్తి వారి కేసి చూశాయి. వారి అరుపులు, కేకలకు మరికొన్ని భయపడి అక్కడ రాళ్ల మధ్య నక్కాయి. అంతే! ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో 70 కుటుంబాలు ఉన్న ఊరంతా అక్కడ చేరింది. వీటినేం చేయాలా? అని గ్రామస్తులు తర్జనభర్జన పడ్డారు. కొందరైతే ఓ పట్టు పడదాం అని లొట్టలేశారు! ఇదిగానీ ఫారెస్టోళ్లకు తెలిస్తే తలకు చుట్టుకుంటుందని కొన్ని పెద్ద తలకాయలు హెచ్చరించడంతో వెనక్కు తగ్గారు. చివరకు నాంపల్లె బీట్ ఆఫీసర్ పద్మకు సమాచారం ఇచ్చారు. అప్పటికే సమయం 8 దాటింది. ఐరాల నుంచి ప్రజలు సైతం కుతూహలం కొద్దీ అక్కడికి వచ్చారు. ఇక బావి చుట్టూ ప్రజల చేరిక కూడా ఎక్కువైంది. జనం అరుపులకు పిల్ల పందులు తారెత్తాయి. ఏదో ఒకటి చెయ్ అన్నట్టు తల్లి చుట్టూ మూగాయి. రాళ్లతో కూడిన ఆ బావిలో తల్లి అటూ..ఇటూ గెంతుతూ, పట్టు జారకుండా నిలదొక్కుకుంటూ, మళ్లీ గెంతుతూ జనం చూస్తూండగానే వారి మధ్యలోకి దూకి..రాకెట్‌లా నర్సరీ గుట్టవైపు దూసుకుపోయింది. ఇక తల్లి చూపిన బాటనే కొన్ని పిల్లలూ అనుసరించే ప్రయత్నం చేసి పైకి చేరుకున్నాయి. అయితే జనం అత్యుత్సాహానికి అవి హడలిపోయాయి. గుట్టవైపు కాకుండా ఊర్లోకి పరుగులు తీశాయి. జనం కూడా పోలోమంటూ వెంటబడడంతో ఇవి ఇళ్లలోకి, పూజ గదుల్లోకి దూరి వస్తువులన్నీ చెల్లాచెదురు చేశాయి. కొన్ని ట్రాక్టర్ల కింద నక్కి, ఎలాగోలా పారిపోయాయి. ఇక ఉరుకులు పరుగులతో అక్కడికి చేరుకున్న నాంపల్లె బీట్ ఆఫీసర్ పద్మ బావి వద్దకు చేరుకుని ప్రజలను కట్టడి చేశారు. మిగిలి ఉన్న అడవి పందుల పిల్లలు కూడా తంటాలు పడుతూ పైకి చేరి, బతుకుజీవుడా అని వరి పొలాల్లోకి గెంతి క్షణాల వ్యవధిలోనే ప్రజలు చూస్తూండగానే అదృశ్యమయ్యాయి.

పరీక్ష కేంద్రాల్లో పక్కాగా వసతులు


సూచనలిస్తున్న పరిశీలకుడు మస్తానయ్య

తవణంపల్లె : పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర పరిశీలకుడు మస్తానయ్య ఆదేశించారు. మంగళవారం మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం ఈ నెల 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన వసతులు కల్పించాలన్నారు. ప్రతి గదిలో రెండు ఫ్యాన్లు,ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ట్యాబ్‌లు ఎలా వాడుతున్నారు. టీచర్లు ట్యాబ్ గురించి నేర్పుతున్నారా లేదా అని ఆరాతీశారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులను కొన్ని ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, జిల్లా పర్యవేక్షణాధికారి మోహన్‌సింగ్, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు


పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ


గుడిపాల: వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో విజయానందరెడ్డి

వి.కోట: మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం 40 కుటుంబాలు పార్టీలోకి చేరగా మంగళవారం మరో 25 కుటుంబాలు ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో కండువా కప్పుకున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆకర్షితులై టీడీపీ నుంచి పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరింత మెజారిటీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని తెలిపారు.పార్టీలో చేరిన వారిలో ఆంజనేయరెడ్డి, శంకరప్ప, సుబ్రమణ్యం, తిమ్మరాజు, కిరణ్‌కుమార్, హనుమంతప్ప, గోవిందప్ప, వెంకటరామప్ప, అజయ్ , సోమశేఖర్, అంజప్ప, హేమంత్ కుమార్ ఉన్నారు.ఎంపీపీ యువరాజు, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్ పాల్గొన్నారు.

విజయానందరెడ్డి సమక్షంలో..

గుడిపాల: మండలంలోని కమ్మతిమ్మాపల్లె సర్పంచ్ రఘుపతినాయుడు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, విజయానంద రెడ్డి చేస్తున్న సేవలకు ఆకర్షితుడై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు రఘుపతినాయుడు తెలిపారు. ఈ క్రమంలోనే రాగిమానుపట్టెడ గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు సైతం విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో మునస్వామినాయుడు, భాస్కర్‌నాయుడు, పట్టాభి, విజయ్, లోకనాథంనాయుడు, చిన్నబ్బ, రామారావు తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారికి విజయానందరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.

దేవుడి సాక్షిగా ‘పచ్చ’ రాజకీయం

- పోలీసులతో గొడవపడి వారిపైనే నెపం నెట్టేందుకు యత్నం

ఫ్యాక్ట్ చెక్

వీకోట/పలమనేరు : వి.కోటలో ఏటా ప్రశాంతంగా నిర్వహించే ఆంజనేయ స్వామి పుష్పపల్లకీ సేవను టీడీపీ నేతలు రాజకీయం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగి తమపైనే దాడి చేశారంటూ నానా హంగామా సృష్టించారు. వివరాలు.. మండల కేంద్రమైన సోమవారం రాత్రి ఆంజనేయస్వామి పుష్పపల్లకి కార్యక్రమం చేపట్టారు. భక్తులు ఎక్కువగా రావడంతో విధుల్లోని పోలీసులు బస్టాండు వద్ద బ్యారికేడ్లు పెట్టారు. కేవలం పాదచారులను మాత్రమే స్వామివారి సేవకు అనుమతించారు. ఈ నేపథ్యంలో ఎల్లో మీడియాకు చెందిన ఓ విలేకరి అక్కడకు బైక్‌పై వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడున్న పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు అడ్డుకోవడంతో వాగ్వాదం మొదలైంది. అదే సమయంలో తుపాకి చిన్నేపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త బాబు కల్పించుకుని ఎస్ఐతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో పోలీసులు అతడిని స్టేషన్‌కు తరలించి ఆపై విడిచిపెట్టారు. దీన్ని ఆసరాగా చేసుకొని టీడీపీ నాయకులు నానా యాగీ చేశారు. టీడీపీ కార్యకర్తను పోలీసులు కొట్టారంటూ ధర్నాకు దిగారు. రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్ నచ్చజెప్పినా ఖాతరు చేయలేదు. 30 పోలీసు యాక్టు అమలులో ఉండడంతో పోలీసులు ధర్నా చేస్తున్న వారిని చెదరగొట్టారు. ఘటనపై విచారించిన పోలీసులు టీడీపీ నేతలు రంగనాథ్, జయరాజ్, సోముతో పాటు 31మందిపై కేసు నమోదు చేశారు.


నిబంధనలకు విరుద్ధంగా ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


పోలీసులు చితకబాదారంటూ డ్రామాలాడుతున్న కార్యకర్తను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పచ్చ పత్రికలో తప్పుడు వార్త

వాస్తవాలను పక్కదోవ పట్టిస్తూ పోలీసులు కావాలనే టీడీపీ కార్యకర్త ముఖంపై బూటుతో తన్నారంటూ ఈనాడు దినపత్రికలో తప్పుడు కథనం ప్రచురించారు. కార్యకర్త సెల్‌ఫోన్‌పై టీడీపీ స్టిక్కర్ ఉన్నందుకే పోలీసులు దాడి చేశారంటూ కథ అల్లారు. అయితే మొత్తం ఘటనను వీక్షించిన ప్రజలు మాత్రం ఎల్లోమీడియా అసత్య వార్తపై మండిపడుతుండడం విశేషం.

ఎమ్మెల్యే నడిపారనే..

ఆంజనేయస్వామి పుష్పపల్లకి ట్రాక్టర్‌ను కొంతసేపు ఎమ్మెల్యే వెంకటేగౌడ నడిపారు. ఇది ఆయనకు ఇది మైలేజీ అవుతుందని భావించిన టీడీపీ శ్రేణులు దేవుడి ముందే రాజకీయానికి తెగబడ్డారు. పోలీసులపై నెపం పెట్టి అసలు దెబ్బలే తగలని టీడీపీ కార్యకర్తలను ఆస్పత్రిలో చేర్పించి నాటకాలు మొదలుపెట్టారు. మాజీమంత్రి అమరనాథ రెడ్డి సైతం సదరు కార్యకర్తలను పరామర్శించి, తమకు అనుకూలంగా పరిస్థితిని మార్చుకునేందుకు యత్నించారు. ఏది ఏమైనా ప్రశాంతంగా ఉండే వి.కోటలో కేవలం రాజకీయాల కోసం గొడవలు సృష్టించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతగా ఎన్నికల విధులు




మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ఎస్పీ జాషువా, హాజరైన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికలు విధులను అధికారులు బాధ్యతతో నిర్వర్తించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశమందిరంలో నామినేషన్ల స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్లు, ఎంసీఎంసీ, తదితర బృందాలు చేపట్టాల్సిన విధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఇతర జిల్లాల కంటే చిత్తూరు జిల్లాపై అందరి దృష్టి ఉంటుందని తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఉండడం వల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎంసీఎంసీ చాలా ముఖ్యమైనదని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు వస్తే ఆ కమిటీ సభ్యులు వెంటనే పరిశీలించి నివేదికలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాకు తొమ్మిది మంది ఎన్నికల అబ్జర్వర్‌లు విచ్చేస్తారని వెల్లడించారు. అబ్జర్వర్‌లు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుంటారన్నారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు.

నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే మోడల్ కోడ్

ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఎంసీసీ అమలులో ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల పుస్తకాలను క్షుణ్ణంగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కోడ్ వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలలో రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలకు ముందస్తుగా డీఎస్పీ నుంచి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్పీ జాషువా మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల్లో అన్ని బృందాలు తటస్థంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకూడదని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


మూషిక వాహనంపై విఘ్నాధిపతి

బంగారుపాళెం: మొగిలి గ్రామంలో మంగళవారం శ్రీమొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూల విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం అలంకారమండపంలో సర్వవిఘ్నాధిపతి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివారిని మూషిక వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. బంగారుపాళ్యానికి చెందిన సరస్వతి, సుధాకర్‌నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ మునిరాజు, వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్ పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం కలశస్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాత్రి మండల కరణం సంక్షేమ సంఘం వారిచే హంస వాహన సేవ నిర్వహించనున్నారు.